తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
03-09-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 206
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## నాపై కుట్ర జరుగుతోంది..



- నాపై కక్ష కడితే బీసీలంతా ఏకమవడం ఖాయం
- నా కూతురు మాట్లాడిన దానికి నన్ను టార్గెట్ చేస్తున్నారు
- డిప్యూటీ సీఎం భట్టి, ఇతర మంత్రులపై తీవ్ర ఆరోపణలు
- తనకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్లు పెట్టి బహిరంగ విమర్శలు చేశారు
- వారికి వెంటనే షోకాజ్ నోటీసులు ఇవ్వాలి
- మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు

3

# కాంగ్రెస్‌లో నిబంధనల రగడ!





## మరి భార్యపై ఆరోపణలు వస్తే.. భర్తపై విచారణ ఉండదా?!
## సుస్మిత మాటలకు క్షమాపణలు చెప్పినా సురేఖను వేధించే ప్రయత్నాలు

- కూతురు మాటలకు తల్లికి బాధ్యతట..
- ఆర్థిక శాఖలో ఫైళ్లకు మోక్షం కలగాలంటే 'మేడమ్'ను సంప్రదించాల్సిందే..
- భట్టి భార్యపై 10శాతం కమీషన్ల ఆరోపణలు
- ఇందిరా పార్క్ ధర్నా సాక్షిగా భట్టి భార్య వసూళ్లపై ఎమ్మెల్సీ నిలదీత
- మరి దీనికేం చెబుతారంటూ విమర్శలు
- సొంత తమ్ముడి భార్యపై ఆరోపణలు క్రమశిక్షణ సంఘం చైర్మన్ కు పట్టదా?
- కొండాపై వేటుకు సిద్ధమైన అధిష్టానం..
- డిప్యూటీ సీఎం భట్టిపై మౌనమేల?
- పార్టీలోనే భగ్గుమంటున్న అంతర్గత అసంతృప్తి

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత క్రమశిక్షణ, నైతిక విలువల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు పార్టీలో పెను తుఫాను సృష్టించిన నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేయడమే కాకుండా, మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఏఐసీసీకి సిఫారసు చేసింది. కూతురు చేసిన వ్యాఖ్యలకు తల్లి ఎలా బాధ్యురాలవుతుందని సురేఖ ప్రశ్నించినా, చివరకు పత్రికా ముఖంగా విచారం వ్యక్తం చేసినా వివాదం సద్దుమణగలేదు. అయితే ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క భార్యపై సాక్షాత్తు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బహిరంగంగా 10 శాతం కమీషన్ ఆరోపణలు చేసినప్పటికీ, ఆయనపై ఎందుకు ఎలాంటి విచారణ జరపడం లేదన్న

మిగతా 2వ పేజీలో..





## అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు
- వెయ్యి రోజుల్లో రూ.4.50 లక్షల కోట్ల అప్పులు
- రుణ మాఫీ, పెన్షన్లు, ఉద్యోగాలు మోసపూరిత హామీలే
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చార్జిషీట్
- సీఎం రేవంత్ పాలనపై నిప్పులు చెరిగిన కేటీఆర్

2

## కాగితాలమీదే ఆర్టీసీ లాభాలు

- ఆర్టీసీకి రూ. 2,600 కోట్ల బకాయిలు చెల్లించాలి
- హరీష్ రావు డిమాండ్

హైదరాబాద్, సిరి న్యూస్ :

ప్రభుత్వ వేదికలపై ఆర్టీసీ వేల కోట్ల లాభాల్లో ఉందని సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెబుతున్నారని, కానీ ఆర్టీసీ ఎండీ మాత్రం ప్రభుత్వం నుంచి రూ.2,600

మిగతా 2వ పేజీలో..



## గ్లోబల్ సమ్మిట్ రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
- దేవరకద్ర డీఆర్‌డీఎల్కు ఉచితంగా భూ కేటాయింపు
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాల సేకరణకు రాష్ట్రం ఆమోదం

3





## విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3

## జన ఆకాంక్షల కేంద్రంగా వెయ్యి రోజుల పాలన

- పేదల అవసరాలు, ఆత్మగౌరవాల మేళవింపుతో సంక్షేమం
- వెయ్యి రోజుల పాలనపై 'ఎక్స్'లో సీఎం రేవంత్ పోస్టు

3



## ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు

3

## జాతీయ జలభద్రతకు ఏకీకృత కార్యాచరణ

- జలభద్రత ఒక ప్రభుత్వ శాఖకే పరిమితం కాకూడదు
- ప్రతి ఆస్తికి 'యూనిక్ ఐడీ' కేటాయించాలి
- జల్ సంచయ్–జన్ భాగీదారీ' సదస్సులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## కాంగ్రెస్ 420 హామీలతో ప్రజా ద్రోహం

- మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

3





## రికార్డు ధరకు హౌసింగ్ బోర్డు ప్లాట్లు

2

## తుక్కుగూడ నర్సు హత్యపై మహిళా కమిషన్ సుమోటో విచారణ

- డీజీపీకి ఎన్‌సీడబ్ల్యూ లేఖ
- వేగంగా దర్యాప్తు.. నిందితుడిపై కఠిన చర్యలు
- ఫోరెన్సిక్, డిజిటల్ ఆధారాల సేకరణ
- ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్

2





## పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :

తమది పేదవాడి కష్టం తెలిసిన ప్రభుత్వమని, గత ప్రభుత్వం వదిలి వెళ్లిన భారీ అప్పులు, పెండింగ్ బిల్లులను చెల్లిస్తూనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2వ పేజీలో..

# తుక్కుగూడ నర్సు హత్యపై మహిళా కమిషన్ సుమోటో విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్:**

తుక్కుగూడలో నర్సుపై అత్యాచారం, హత్య ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా విచారణ చేపట్టింది. ఘటనను తీవ్రంగా పరిగణించిన కమిషన్ తెలంగాణ డీజీపీకి లేఖ రాసింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించింది.

**నిందితుడి నేరచరిత్రపై ఆరా**

నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని, ఘటనకు దారితీసిన పరిస్థితులు, హత్యకు గల కారణాలను వెలుగులోకి తీసుకురావాలని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ సూచించారు. నిందితుడి పూర్వ నేరచరిత్రను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

**ఆధారాల సేకరణకు ప్రాధాన్యం**

అత్యాచారం, హత్య, క్రిమినల్ ట్రెస్‌పాస్‌కు సంబంధించిన బీఎన్ఎస్ సెక్షన్లను కఠినంగా అమలు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది. వైద్య పరీక్షలు, పోస్టుమార్టం, ఫోరెన్సిక్, డిజిటల్ ఆధారాలను భద్రపరిచి సమగ్రంగా పరిశీలించాలని సూచించింది. సీడీఆర్‌లతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాలని ఆదేశించింది.

**కుటుంబానికి రక్షణ, న్యాయసాయం**

బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు అవసరమైన న్యాయసాయం అందించాలని ఎన్‌సీడబ్ల్యూ సూచించింది. కుటుంబానికి వర్తించే చట్టబద్ధ పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

**ఏడు రోజుల్లో నివేదిక**

దర్యాప్తు పురోగతి, ఫోరెన్సిక్ నివేదికలు, ఛార్జ్‌షీట్ దాఖలు గడువు, కేసు పర్యవేక్షణకు తీసుకున్న చర్యల వివరాలతో ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించాలని తెలంగాణ పోలీసులను కోరింది. పనిచేసే మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీపడేది లేదని జాతీయ మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

# పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి సచివాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 3,475 రోజులు పాలించిన గత ప్రభుత్వం రాష్ట్రంపై ఆర్థిక భారాన్ని మోపి వెళ్లినప్పటికీ సంక్షేమం, అభివృద్ధిని ఎక్కడా ఆపకుండా తమ వెయ్యి రోజుల ప్రజా పాలనను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. గతంలో ఆగిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించిన అసలైన బిల్లులు, సర్పంచులు, కాంట్రాక్టర్ల బకాయిలను కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో మరో మూడు లక్షలకు పైగా కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు.

**4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ. 5 లక్షల సహాయం అందిస్తోంది. త్వరలోనే రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నారు.

**హైదరాబాద్‌లో 'ఇందిరమ్మ టవర్స్'**

పేదలను దూరప్రాంతాలకు పంపకుండా వారు నివసించే నియోజకవర్గాల్లోనే, ఎకరం రూ. 100 కోట్లకు పైగా విలువైన ఖరీదైన స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని 20 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు 600 ఇళ్ల చొప్పున బహుళ అంతస్తుల్లో లిఫ్ట్, మౌలిక వసతులతో నిర్మిస్తున్నారు. పారదర్శక లక్కీ డ్రా విధానం ద్వారా ఎంపిక చేసిన అర్హులైన మహిళల పేరు మీదనే 525 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇంటిని, భూమిలో అన్‌డివైడెడ్ షేర్‌తో రిజిస్టర్ చేస్తారు. దీనికోసం పేదలపై రూపాయి భారం పడదని, ఎలాంటి పైరవీలు, సిఫారసులకు అవకాశం లేదని తేల్చి చెప్పారు.

**రైతు భరోసా & నిరుద్యోగులకు ఊరట**

గత వెయ్యి రోజుల్లో రైతు సంక్షేమానికి రూ. 1.76 లక్షల కోట్లు వెచ్చించామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి వేలాది ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల దగా పాలనపై పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో బుధవారం చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతమే.. వెయ్యి రోజుల పాలన కాదు.. పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన అని మండిపడ్డారు. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో అని అన్నారు. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కవి□షన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయకున్నా ఈ ప్రభుత్వం రూ.4.50లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. రూ.50వేల కోట్లు రుణ మాఫీ చేస్తామని రూ.20వేల కోట్లు చేశారని, రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టు పెట్టారని, మాఫీ చేయకుండా 70శాతం మందికి కుచ్చుటోపీ పెట్టారని విమర్శించారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే కాంగ్రెస్ నాశనం చేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది.. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ పాలనలో దిల్లీకి మూటలు, పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు.. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది అని విమర్శించారు. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం అని హెచ్చరించారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు కానీ రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, జాబ్ క్యాలెండర్ పేరిట జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని అన్నారు. దిల్లీలో జెన్ జీని వెంటపెట్టుకుని ప్రజాస్వామ్యమని రాహుల్ కొటేషన్లు చెబుతుంటే ఇక్కడ మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర సంపద కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారని, ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అని అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారంటూ ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసిందేవి□ లేదన్నారు. చంద్రబాబుకు గురు దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడన్నారు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెబితే వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్ డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్‌ఏ నోరు తెరవకపోవడాన్ని ఆక్షేపించారు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. యూరియా అడిగిన రైతులపై లాఠీచార్జి చేశారు.. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష.. మోటర్లకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ కుప్ప కూలిందన్నారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో నిబంధనల రగడ!

**మొదటిపేజీ తరువాయి**

ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లోనే భగ్గుమంటోంది. కూతురు మాట్లాడితే తల్లిపై వేటు వేసేందుకు సిద్ధపడే నాయకత్వం, భార్యపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తే భర్త అయిన డిప్యూటీ సీఎంను ఎందుకు ప్రశ్నించడం లేదని పార్టీలోని అసంతృప్త నేతలు నిలదీస్తున్నారు.









**భట్టి భార్యపై 10 శాతం కమిషన్ ఆరోపణలు**

మరోవైపు, రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భార్య వ్యవహారశైలిపై గత రెండేళ్లుగా తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్థిక శాఖ నుంచి ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేదా కాంట్రాక్టర్ల బిల్లులు విడుదల కావాలంటే 'మేడమ్'ను సంప్రదించాల్సిందేనని, బిల్లుల్లో 10 శాతం కమీషన్ ముట్టజెప్పాలనే డిమాండ్ వస్తోందని బాధితులుగా పేర్కొంటున్న రిటైర్డ్ ఉద్యోగులు గతంలోనే ఆరోపించారు. ఒకవైపు కాంట్రాక్టర్లు, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులు నేరుగా డిప్యూటీ సీఎం భార్య కేంద్రంగానే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఫైళ్లకు మోక్షం లభిస్తోందని బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. అయినప్పటికీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ ఆరోపణలపై ఏనాడూ పత్రికాముఖంగా ఖండించకపోవడం, ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.

**ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి బహిరంగ నిలదీత..**

తాజాగా ఇందిరా పార్క్ వద్ద జరిగిన పెన్షన్ విద్రోహ దినం మహాధర్నాలో వేలాది మంది ఉపాధ్యాయుల సమక్షంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి నేరుగా ఈ అంశాన్ని లేవనెత్తడం రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది. ప్రభుత్వ ఉద్యోగులకు నెలవారీ జీతం తప్ప ఎలాంటి భత్యాలు, పీఆర్సీ, బకాయిలు ఇవ్వడం లేదని మండిపడిన ఆయన, తమ కష్టార్జితమైన బకాయిలు విడుదల చేయాలంటే ఆర్థిక మంత్రి భార్యకు 10 శాతం లంచం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల రక్తాన్ని పిండే ఇలాంటి లంచాల సంస్కృతి గతంలో ఎన్నడూ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా ఉన్న ఒక ఎమ్మెల్సీ వేలాది మంది సాక్షిగా డిప్యూటీ సీఎం కుటుంబంపై ఇంతటి బహిరంగ ఆరోపణ చేసినా ప్రభుత్వం నుంచి గానీ, పార్టీ నుంచి గానీ ఎలాంటి స్పందన లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

**క్రమశిక్షణ కేవలం పార్టీకేనా..?**

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ అనేది కేవలం కొందరికే పరిమితమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా మల్లు రవి ఉన్నారు. మరి సొంత తమ్ముడి భార్యపై ఆరోపణలు వస్తే క్రమశిక్షణ సంఘం కమిటీ ఏం చేస్తుందనే ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యమంత్రిని విమర్శించినందుకు ఒక మంత్రిని పదవి నుంచి తప్పించేందుకు సిద్ధమైన క్రమశిక్షణ కమిటీ, పీసీసీ నాయకత్వం, ప్రభుత్వంలో నంబర్ 2గా ఉన్న ఉప ముఖ్యమంత్రి కుటుంబంపై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని పార్టీ శ్రేణులే ప్రశ్నిస్తున్నాయి. కేవలం వాస్తవాలు మాట్లాడినందుకు, రాజకీయ శత్రుత్వంతో కొండా సురేఖను బలిపశువును చేయాలని చూస్తున్నారని, అదే సమయంలో బహిరంగంగా ప్రజలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తీవ్ర అవినీతి ఆరోపణలు చేసిన డిప్యూటీ సీఎంపై కనీస విచారణ కమిటీని ఎందుకు నియమించరని కాంగ్రెస్‌లోని ఓ బలమైన వర్గం నిలదీస్తోంది.

**అధిష్ఠానం తీరుపై అసంతృప్తి**

ఈ రెండు అంశాలను బేరీజు వేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు.. పార్టీలో నిబంధనలు వ్యక్తులను బట్టి మారిపోతున్నాయని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నాయి. కూతురు చేసిన వ్యాఖ్యలను సాకుగా చూపి బీసీ మహిళా మంత్రిని టార్గెట్ చేయడం వెనుక కుట్ర దాగి ఉందని, భార్య ప్రమేయంతో నడుస్తున్న ఆర్థిక శాఖ లావాదేవీలపై వస్తున్న ఆరోపణలను తొక్కిపెట్టడం అధిష్ఠానం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్ఠానం ఏకపక్ష నిర్ణయాలు మానుకుని, కొండా సురేఖపై కక్షసాధింపు చర్యలను విరమించుకోవడంతో పాటు, ఉప ముఖ్యమంత్రి భార్యపై వచ్చిన 10 శాతం కమిషన్ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కాంగ్రెస్ అసంతృప్త వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జాతీయ జలభద్రతకు ఏకీకృత కార్యాచరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, సిరి న్యూస్:**

దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రతి జల సంరక్షణ పనిని ఒకే జలభద్రతా ప్రణాళిక పరిధిలోకి తీసుకురావాలని నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి జల సంరక్షణ ఆస్తికి ప్రత్యేక గుర్తింపు ఉండాలని, దాని నిర్వహణకు నిర్దిష్ట బాధ్యతగల సంస్థను కేటాయించడంతోపాటు కొలవగలిగే స్పష్టమైన ఫలితాలను సాధించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన తొలి 'జల్ సంచయ్-జన్ భాగీదారీ' జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. జలభద్రత అనేది కేవలం ఒక ప్రభుత్వ శాఖ లేదా ఇంజినీరింగ్ విభాగానికే పరిమితం కాకూడదని, తాగునీరు, వ్యవసాయ స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ కోసం ఇది ప్రజలందరి భాగస్వామ్యంతో కూడిన ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు.



**సమన్వయ లోపం అధిగమించాలి**

ఉపాధి హామీ, పీఎంకేఎస్‌వై, 'కంపా', ఆర్థిక సంఘం, సీఎస్ఆర్ నిధులతో వేర్వేరుగా పనులు చేపట్టడం వల్ల ప్రణాళికల్లో విచ్ఛిన్నం, నిధుల పునరావృతం జరుగుతున్నాయని విమర్శించారు. వీటి స్థానంలో ప్రతి ఆస్తికి 'యూనిక్ ఐడీ' కేటాయించి జియో ట్యాగింగ్ చేయాలని ఆయన ప్రతిపాదించారు.

**తెలంగాణ రికార్డు**

'జల్ సంచయ్-జన్ భాగీదారీ' కింద 2025లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరచడమే కాకుండా దేశంలోని టాప్ 50 జల సంరక్షణ జిల్లాల్లో రాష్ట్రానికి చెందిన 13 జిల్లాలు స్థానం సాధించాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. రాష్ట్రంలో 44,360 చెరువులకు గాను ఇప్పటికే 22,428 జలవనరుల పునరుద్ధరణ పూర్తయినట్లు వెల్లడించారు.

**రూ. 46,110 కోట్ల ప్రణాళికలు**

2026-29 మూడేళ్ల వ్యవధిలో రూ. 46,110.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా 17.28 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. రాష్ట్రంలోని 18 ప్రధాన జలాశయాల్లో పూడిక వల్ల దాదాపు 22.95 శాతం (40.97 టీఎంసీలు) నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, దీనిని పునరుద్ధరించేందుకు దిగువ మానేరు, మధ్య మానేరు, కడెం ప్రాజెక్టుల్లో ఆదాయ ఆధారిత పూడికతీత పనులను ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు.

**తెలంగాణ ప్రాజెక్టులకు పీఎంకేఎస్‌వై కింద ప్రాధాన్యం**

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు పిఎంకెఎస్‌వై కింద ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ అనుమతులను నిర్దిష్ట గడువులోగా మంజూరు చేయాలని మంత్రి కోరారు.



# రికార్డు ధరకు హౌసింగ్ బోర్డు ప్లాట్లు

- **కేపీహెచ్‌బిలో గజం భూమి రూ.2.70 లక్షలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :**

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బి) కాలనీలోని ఓపెన్ ప్లాట్లకు బహిరంగ వేలంలో మరోసారి భారీ ధర పలికిందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలం పాటలో కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ప్లాట్లకు సంబంధించి గరిష్టంగా చదరపు గజం భూమి రూ. 2.70 లక్షల రికార్డు ధరకు అమ్ముడు పోయినట్లు వెల్లడించారు. ఈ ప్లాట్ల విక్రయానికి ఆగస్టు 10న నోటిఫికేషన్ విడుదల చేయగా చదరపు గజానికి కనీస ధర రూ.1.60 లక్షలుగా నిర్ణయించారు. వేలంలో తీవ్ర పోటీ నెలకొనడంతో ఒక ప్లాట్ రూ.2.70 లక్షలు, మరొకటి రూ.2.36 లక్షలు, అలాగే మరో రెండు ప్లాట్లు రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి. మొత్తం 19 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో సగటున చదరపు గజం ధర రూ.1.79 లక్షలు పలికింది. ఈ బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరిందని వైస్ చైర్మన్ వివరించారు.

# కాగితాలమీదే ఆర్టీసీ లాభాలు

**మొదటిపేజీ తరువాయి**

కోట్ల బకాయిలు రావాలని లేఖ రాశారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు విమర్శించారు. కాగితాల మీద ఆర్టీసీ లాభాల్లో ఉందని చెబుతూ క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, విశ్రాంత కార్మికుల జీవితాలను అప్పుల ఊబిలోకి నెట్టారని బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ ప్రభుత్వం 'ప్రజా ప్రభుత్వం' కాదని, కేవలం 'ప్రచార ప్రభుత్వం' అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఉద్యోగులకు పీఆర్సీ, ఏరియర్స్ అందడం లేదని తెలిపారు. 30-40 ఏళ్ల పాటు సేవ చేసిన సుమారు 18 వేల మంది విశ్రాంత ఉద్యోగులకు నేటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం దారుణమన్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇప్పటికే 400 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ సౌకర్యం లేని వీరికి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ ఏరియర్సే చివరి ఆసరాని, వాటిని కూడా ఆపేయడం ప్రభుత్వ అమానవీయ వైఖరికి పరాకాష్ట అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.2,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి విశ్రాంత కార్మికుల హక్కులను నెరవేర్చాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# షోకాజ్ నోటీసులు ఇవ్వడమే తప్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, సిరి న్యూస్:**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితా పటేల్ వ్యాఖ్యలతో నెలకొన్న వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి వెళ్లిన కొండా సురేఖ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సుస్మితకు పెళ్లయిందని, ఆమె స్వతంత్రంగా జీవిస్తున్నారని తెలిపారు. ఆమెను మాట్లాడొద్దని చెప్పే హక్కు తనకు లేదన్నారు.

**షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు**

తన కుమార్తె వ్యాఖ్యలను తాను సమర్థించడమూ, ఖండించడమూ చేయనని సురేఖ తెలిపారు. ఆమె మాట్లాడిన విషయాలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. అసలు తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పని పేర్కొన్నారు. తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుపైనే స్పందించానని, తుది నిర్ణయం అధిష్టానానిదేనని చెప్పారు.

**తనపై మాట్లాడిన వారిపైనా చర్యలు**

తనపై విమర్శలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపైనా చర్యలు తీసుకోవాలని సురేఖ డిమాండ్ చేశారు. తనపై మాట్లాడిన వారు బలవంతంగా వచ్చి వ్యాఖ్యలు చేశారని అన్నారు. వారి వెనుక ఎవరున్నారో తనకు తెలుసని, పేర్లు చెబితే వివాదం మరింత ముదురుతుందని పేర్కొన్నారు. వారికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు.

**బీసీలకు అన్యాయం చేస్తే ఏకమవుతారు**

తన భర్త మున్నూరు కాపు, తాను పద్మశాలి అని సురేఖ తెలిపారు. తెలంగాణలో బీసీలకు గణనీయమైన ఓటు బలం ఉందన్నారు. బీసీ మహిళనైన తనకు ఒక న్యాయం, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నేతలకు మరో న్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. తనపై ఏకపక్షంగా చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమవుతారని హెచ్చరించారు.

**పదవిలో కొనసాగించాలని విజ్ఞప్తి**

తాను తన శాఖను సమర్థంగా నిర్వహిస్తున్నానని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నానని సురేఖ తెలిపారు. తన పదవికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరినట్లు చెప్పారు. ఖర్గే, మీనాక్షి నటరాజన్ పార్టీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని వెల్లడించారు. కేసీ వేణుగోపాల్‌ను కలవాలని ప్రయత్నించినా ఆయన బిజీగా ఉండటంతో అపాయింట్‌మెంట్ దొరకలేదన్నారు.



**రేవంత్‌పై ముందుగా చర్యలు తీసుకోవాలి**

అంతకుముందు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ప్రశ్నలు సంధించారు. 'పదేళ్లు ఆయనే సీఎం' అని రేవంత్ ఎలా అంటారని ప్రశ్నించారు. పార్టీ లైన్ దాటి ఆయన చేసిన వ్యాఖ్యలపై ముందుగా వివరణ కోరాలని అన్నారు. తన కుమార్తె మాట్లాడిన విషయాలకు తనపై చర్యలు తీసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టికెట్లు ఎవరికి ఇవ్వాలనేది రేవంత్ రెడ్డి ఎలా నిర్ణయిస్తారని నిలదీశారు.

**అధిష్టానానికి లేఖలు**

ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు లేఖలు రాసినట్లు సురేఖ తెలిపారు. తనకు చెప్పాల్సిన విషయాలన్నీ పార్టీ పెద్దలకు చెప్పానని, ఇక అధిష్టానం తీసుకునే నిర్ణయాన్ని బట్టి తన తదుపరి ఆలోచన ఉంటుందని స్పష్టం చేశారు.

# నాపై కుట్ర జరుగుతోంది..

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్న మంత్రి కొండా సురేఖ మరోసారి సంచలన వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించారు. ఢిల్లీలో విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించిన ఆమె.. తనపై పార్టీలో జరుగుతున్న పరిణామాలు, కుట్రలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తనను లక్ష్యంగా చేసుకుని కొందరు నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి విమర్శలు గుప్పిస్తున్నారని, అలాంటి వారిపై పార్టీ అధిష్టానం వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలపై వస్తున్న అవినీతి ఆరోపణలను ప్రస్తావిస్తూ తీవ్ర నిలదీతలు చేశారు. సాక్షాత్తు సీఎం, మంత్రులపై ఆరోపణలు వస్తే ఎలాంటి చర్యలు తీసుకోని అధిష్టానం.. తన కూతురు సుస్మిత మాట్లాడిన వాస్తవాలపై మాత్రం తనను టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. నా కూతురు పరకాల నియోజకవర్గ అంశంపై, జరుగుతున్న పరిణామాలపై కేవలం వాస్తవాలే మాట్లాడింది. అందుకు నన్ను బాధ్యురాలిని చేసి మంత్రి పదవి నుంచి తొలగించాలనుకోవడం ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యే అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భార్యపై వస్తున్న ఆరోపణలపై ఆయనకు ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి సహా పలువురు మంత్రులపై ఆరోపణలు వచ్చినా ఎవరిపై విచారణ జరిపించారని నిలదీశారు. ముఖ్యమంత్రి సోదరుల వ్యాపారాలు, అవినీతి ఆరోపణలపై సీఎంను ఎందుకు ప్రశ్నించరని అన్నారు. తాను బీసీ మహిళ కావడంతోనే తనపై నిబంధనలు మారుతున్నాయని, తనపై ఏకపక్షంగా చర్యలు తీసుకుంటే రాష్ట్రంలోని బీసీలందరూ ఏకమై తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు స్పష్టమైన లేఖలు రాసినట్లు ఆమె తెలిపారు. పార్టీ లైన్ దాటి పదేళ్లు నేనే సీఎం అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానిస్తే కనీసం వివరణ ఎందుకు అడగలేదని ప్రశ్నించిన ఆమె, తనకు ఇప్పటివరకు ఎవరూ రాజీనామా చేయమని చెప్పలేదని స్పష్టం చేశారు.



# గ్లోబల్ సమ్మిట్ రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'తో పాటు 'రక్షణ ఎక్స్‌పో2026'కు హాజరుకావాల్సిందిగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. బుధవారం దిల్లీలో కేంద్ర మంత్రితో భేటీ అయిన సీఎం సదస్సు నిర్వహణ, రాష్ట్రంలోని పలు రక్షణ రంగ ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సమ్మిట్ జరగనుందని, అందులో భాగంగా నిర్వహించే 'రక్షణ ఎక్స్‌పో2026'ను ప్రారంభించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు

**రక్షణ ఎక్స్‌పో భాగస్వామ్యం**

ఎయిర్‌షో నిర్వహణకు గగనతల అనుమతులతోపాటు భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా సహకరించాలని కోరారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రతినిధులు ఈ ఎక్స్‌పోలో పాల్గొనేలా చూడాలన్నారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు డీఆర్‌డీవో ల్యాబ్‌లు తమ సాంకేతికతను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

**డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు భూ కేటాయింపు**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ చేపట్టనున్న ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని టీజీఐఐసీ ద్వారా 33 సంవత్సరాల కాలానికి, సంవత్సరానికి ₹1 నామమాత్రపు లీజు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలియజేశారు.

**ఆదిలాబాద్ విమానాశ్రయం**

విమానాశ్రయం కోసం ఇప్పటికే 750 ఎకరాలు సేకరించగా రక్షణ శాఖ విజ్ఞప్తి మేరకు మిగిలిన 750 ఎకరాలు (మొత్తం 1500 ఎకరాలు) కూడా సేకరించి ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేష్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

# విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

- రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయండి
- ఆదిలాబాద్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో వసతులు కల్పించండి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**దిల్లీ, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :**

ఆదిలాబాద్, మామూనురు(వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. దిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో(మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. మామునూరు ఎయిర్‌పోర్టు టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబరు నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో రాష్ట్రంలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలియజేశారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ భేటీ

- పలు కీలక అంశాలపై చర్చ

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో బుధవారం వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలపై ఆయా శాఖల కార్యదర్శులతో ఆయన విస్తృతంగా చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్, రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్‌లను సీఎస్ వేర్వేరుగా కలిశారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్‌తో జరిగిన భేటీలో తెలంగాణలో పట్టణాభివృద్ధి, నివాస గృహాల నిర్మాణం, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.రహదారుల రవాణా శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్‌తో సమావేశమై రాష్ట్రంలో రహదారి అనుసంధానతను పెంచడం, జాతీయ రహదారుల విస్తరణ, రవాణా మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్షించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మెరుగైన సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్‌ది అరాచక పాలన

- త్వరలో బీజేపీ ప్రజా ప్రభుత్వం ఖాయం
- పరకాల అమరధామం స్ఫూర్తితో నిరంకుశ సర్కార్‌పై పోరాటం
- బీజేపీ కార్యకర్తలు, కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యంపై దాడి
- బీఆరఎస్ కుటుంబ పాలన.. కాంగ్రెస్ 'బ్రదర్స్ అండ్ కంపెనీ' పాలన
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**భువనగిరి, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :**

దక్షిణ భారత జలియన్‌వాలా బాగ్‌గా చరిత్రకెక్కిన పరకాల మారణకాండలో నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి అసువులు బాసిన వీరుల త్యాగాలు చిరస్మరణీయమని, ఆ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రజావ్యతిరేక, దౌర్జన్య పాలనపై రాజీ లేని పోరాటం సాగిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు. పరకాల అమరధామంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించేందుకు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర అధికారిక ప్రతినిధి రాణి రుద్రమ, తదితరులతో కలిసి ఆయన బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో భువనగిరిలో బీజేపీ శ్రేణులతో కలిసి ఆయన అల్పాహార సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కక్షసాధింపు చర్యల్లో అక్రమ అరెస్టులను ఎదుర్కొని, మెజిస్ట్రేట్ ద్వారా బెయిల్‌పై విడుదలైన స్థానిక కార్యకర్తలను పరామర్శించారు. అనంతరం భువనగిరిలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.




**బీజేపీ శ్రేణులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం**

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ కార్యాలయాలపై విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నాయని, పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడి ఇంట్లోకి చొరబడి ఆయన తల్లిపై కూడా దాడి చేయడం కాంగ్రెస్ గూండాగిరికి పరాకాష్ట అని రామచందర్‌రావు దుయ్యబట్టారు. దళితులు ఆరాధ్య దైవంగా భావించే సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు పూసి అవమానించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి భౌతిక దాడులకు తావులేదన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి**

గతంలో పశ్చిమ బెంగాల్‌లో నాటి అధికార పార్టీ ఏ విధంగానైతే ప్రతిపక్షాలపై, ప్రజలపై హింసాత్మక దాడులకు పాల్పడిందో అదే తరహా హింసాత్మక రాజకీయాలను తెలంగాణలో కాంగ్రెస్ పునరావృతం చేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో దౌర్జన్యాలకు స్వస్తి పలికి బీజేపీని ప్రజలు ఎలా ఆదరించారో తెలంగాణలోనూ కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు అదే గతి పట్టిస్తారన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు, మిగిలి ఉన్న సుమారు 750 రోజుల వ్యవధిలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

**పోరు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మాత్రమే**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక కుటుంబం మాత్రమే బాగుపడింది తప్ప ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ 'బ్రదర్స్ అండ్ కంపెనీ'గా మారి రాష్ట్రాన్ని దోచుకుంటోందని రామచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనను, కాంగ్రెస్ దోపిడీని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అందుకే రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి, సమగ్ర అభివృద్ధికి ఏకైక ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ముఖాముఖి పోరాటం ఉంటుందని, ప్రజల ఆశీస్సులతో బీజేపీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున

### జన ఆకాంక్షల కేంద్రంగా

# వెయ్యి రోజుల పాలన

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :**

జన ఆకాంక్షలే కేంద్రంగా త్యాగాల ఆశయాలే ఇంధనంగా సాగిన వెయ్యి రోజుల ప్రజా ప్రస్థానం ఇది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన సందర్భంగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. పేదల అవసరాలను, వారి ఆత్మగౌరవాలను మేళవించి సంక్షేమం అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర దీర్ఘకాలిక భవితను, బిడ్డల ఉపాధిని మేళవించి అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. సకల వర్గాల సామాజిక న్యాయాన్ని, సమాన అవకాశాలను మేళవించి సాగిస్తున్న పాలన వెయ్యి రోజుల ఈ ప్రయాణం అని ఆయన పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆశీస్సులు, లక్షలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తల అండతో తెలంగాణను విశ్వ వేదికపై విజయపతాకగా నిలిపే వరకు అవిశ్రాంతంగా ఈ కృషిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రయాణంలో తోడుగా, నీడగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మీతో ఈ అనుబంధం నా గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటుంది అని సీఎం రేవంత్ అన్నారు.

## ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్

**దిల్లీ, సెప్టెంబర్ 2 , సిరి న్యూస్:**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా దిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని అన్నారు. కార్యక్రమంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ఎం.అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ 420 హామీలతో

# ప్రజా ద్రోహం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, సిరి న్యూస్:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయిందని, ఇది తెలంగాణ సమాజాన్ని ప్రతీ విషయంలోనూ మోసం చేసిన '420' ప్రభుత్వమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దిల్లీలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 సబ్‌గ్యారెంటీల పేరుతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం, గత వెయ్యి రోజుల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. హామీలు నెరవేర్చకపోగా రాష్ట్రాన్ని రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, ఆరు డీఏలను నిలిపివేసి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సరైన క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించకుండానే ఈహెచ్ఎస్ పేరుతో జీతాల నుంచి కోతలు విధించడం దుర్మార్గమని ఆయన ధ్వజమెత్తారు.

**మహిళలు, వృద్ధులు & నిరుద్యోగులు,**

**రైతాంగం, విద్యా రంగం**

మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు వితంతువులకు రూ.4,000 పెన్షన్ హామీల ముసుగులో మోసగించారని ఆరోపించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. రూ.2 లక్షల పూర్తిస్థాయి రుణ మాఫీ చేయకుండా రైతులను నమ్మించి గొంతు కోశారని, రైతు భరోసా బకాయిలు దాదాపు రూ.57 వేల కోట్లకు చేరాయని తెలిపారు. విద్యారంగానికి సంబంధించి రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన రూ.60 వేల కోట్లను విడుదల చేయకపోగా కుల గణన పేరుతో నాటకమాడుతూ అన్యాయం చేశారని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలనపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలపరిమితి ముగిసిన తర్వాత కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## స్వదేశీ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావాలి

- డీఆర్ డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి
- హైదరాబాద్‌లో రాఘవ ఏరోస్పేస్ ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్ :**

భారతదేశ రక్షణ తయారీ రంగం గణనీయమైన ప్రగతిని సాధించిందని, దేశీయంగా ఉత్పత్తి చేసే ఆయుధాలను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి మన దేశం రూపాంతరం చెందిందని డెవలప్‌మెంట్‌కమ్‌ప్రొడక్షన్ భాగస్వామి, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఏడీపీఎల్)ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆత్మనిర్భర్ భారత్' చొరవ కింద కేంద్ర ప్రభుత్వం రక్షణ బడ్జెట్‌లో స్వదేశీ తయారీ కోసం ₹1.39 లక్షల కోట్లను కేటాయించిందని తెలిపారు. ఆర్మేనియా దేశం తన రిపబ్లిక్ డే పరేడ్‌లో మన దేశీయ ఆయుధ వ్యవస్థలను ప్రదర్శించడం గర్వకారణమన్నారు. రాఘవ ఏరోస్పేస్ సంస్థ కేవలం దేశీయ మార్కెట్‌పైనే కాకుండా అంతర్జాతీయ ఎగుమతులపై దృష్టి సారించాలని సూచించారు.

**కంపెనీ విశేషాలు**

ఆర్ఏడీపీఎల్ సంస్థ ఏరోస్పేస్, రక్షణ, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగాల్లో ఆర్ అండ్ డీ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, కాంపోజిట్ స్ట్రక్చర్స్‌పై పనిచేస్తుంది. దీని వద్ద అత్యాధునిక క్లీన్ రూమ్, మైక్రోవేవ్ టెస్టింగ్, కాంపోజిట్ తయారీ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. పెరిడాట్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌తో కలిసి మేల్300 జాయింట్ వెంచర్‌ను ప్రకటించింది. ఇది 300 కిలోల పేలోడ్, 30 గంటల ఓర్పుతో 30,000 అడుగుల ఎత్తు వరకు ఎగిరే స్వదేశీ డ్రోన్. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లిఖిత్ రెడ్డి పొంగులేటి మాట్లాడుతూ దేశీయ రక్షణ రంగానికి అవసరమైన ఉత్పత్తులను అందించడంతో పాటు అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్లలో ముందంజలో ఉండటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



## యూరియా కోసం తిప్పలు తప్పవా !

# చెప్పులే క్యూలో!



- సర్వర్ సమస్యతో రెండు గంటలుగా నిరీక్షించిన రైతులు
- 1100బస్తాలు అందుబాటులో ఉన్నా పంపిణీకి సాంకేతిక ఆటంకం

**పాపన్నపేట సెప్టెంబర్ 2 సిరి న్యూస్ :** పాపన్నపేట మండలం లో యూరియా కోసం రైతుల కష్టాలు తప్పడం లేదు. మండలకేంద్రమైన పాపన్నపేట సొసైటీలో యూరియా నిల్వలు అందు బాటులోకి రావడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే సర్వర్ సమస్య తలెత్తడంతో సుమారు రెండు గంటల పాటు పంపిణీకి అంతరాయం ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొన్నారు. మండుతున్న ఎండను సైతం లెక్కచే యకుండా రైతులు సొసైటీ వద్ద బారులు తీరారు. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో తెలియక నిరీక్షించిన పలువురు రైతులు ఎండలో నిలబడలేక తమ చెప్పులను క్యూలో పెట్టి వంతు స్థానాలను కాపాడుకున్న దృశ్యం అక్కడ కనిపించింది. సొసైటీలో సుమారు 1100 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ సాంకేతిక సమస్య కారణంగా పంపిణీలో జాప్యం ఏర్పడింది. దీంతో యూరియా కోసం వచ్చిన రైతులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. యూరియా ఉంది. కానీ సర్వర్ సహకరించలేదు! అన్నట్లుగా పరిస్థితి మారింది.ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజును వివరణ కోరగా సర్వర్ లో సాంకేతిక సమస్య తలెత్తడంతో రైతులకు కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. సమస్యను పరిష్కరించి యూరియా పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. యూరియా కోసం ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న తమకు సర్వర్ సమస్యలు మరింత భారంగామారుతు న్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ముసాయిదా ఓటరు జాబితాను

# పరిశీలించుకోవాలి

- సెప్టెంబర్ 16లోగా అభ్యంతరాలు దాఖలు చేసుకోవాలి
- ఈ ప్రక్రియలో భాగస్వామిలై ఓటరు జాబితాలో వివరాలను సరిచూసుకోవాలి
- • సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

భారత ఎన్నికల సంఘం ఆదేశాలు మరియు మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్నందున, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ షెడ్యూల్ లో భాగంగా గతేడాది ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. ముసాయిదా జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్దేశిత గడువులోగా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వద్ద క్లెయిమ్ లు, అభ్యంతరాలు దాఖలు చేయాలని కలెక్టర్ తెలిపారు. క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణకు గడువు సెప్టెంబర్ 16 వరకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన పౌరులు ఓటరు జాబితాలో పేరు నమోదు, వివరాల సవరణ తదితర అంశాలకు సంబంధించి దరఖాస్తులను సంబంధిత ఈఆర్ఓ వద్ద నిర్దేశిత విధానంలో సమ ర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కీలక ప్రక్రియకు సంబంధించిన సమాచారం ప్రతి అర్హత కలిగిన పౌరుడికి చేరేలా ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీ లించుకుని, గడువులోగా క్లెయిమ్ లు లేదా అభ్యంతరాలు దాఖలు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మునిపల్లి ఎస్సీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ

**మునిపల్లి, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**



మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి రామాచారి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిర్వహణ తీరును తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంపై వార్డెన్ రామప్పను అభినం దించారు. అనంతరం స్టోర్‌లో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలించి, బియ్యంలో పురుగులు రావడం లేదని నిర్ధారిం చుకుని వార్డెన్‌ను వివరాలు అడిగి తెలు సుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం అందేలా చూడాలని సూచించారు.

# బడుగు బలహీన వర్గాల నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి

- ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు
- పూలమాల వేసి నివాళులర్పించిన మండల కాంగ్రెస్ నాయకులు

**వెల్దుర్తి,సెప్టెంబర్ 02, (సిరి న్యూస్):**

బడుగు బలహీన వర్గాలనేతగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కీర్తింపబడ్డారని డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎనలేని సేవలు చేశారని మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ అన్నారు. బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నేతలు పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. పేదలు,రైతులు, విద్యార్థులు,మహిళలు, కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిర స్మరణీయమని కొనియాడారు.ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్,ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో పేద ప్రజలకు అండగా నిలిచిన మహానేత వైఎస్సార్ అని అన్నారు.వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శేఖ గౌడ్, కిష్టా గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ముక్తాబాయ్, వార్డ్ మెంబర్ మహేందర్ గౌడ్, శివలింగం, రవి, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.
- మెదక్ మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎంఆర్ చెక్కుల పంపిణీ.

**మెదక్ సెప్టెంబర్,02(సిరి న్యూస్)**

పేద,మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ శాసన సభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం మెదక్ మండలంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ద్వారా నిత్యావసర సరుకులు అందించడంతో పాటు, ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆరోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాహాసిల్దార్ లక్ష్మణ్ బాబు ,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





- స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ
- మెదక్ నియోజకవర్గ శాసన సభ్యులు డా:మైనంపల్లి రోహిత్ రావు ప్రభుత్వం

**పాపన్నపేట్ సెప్టెంబర్ 2 సిరి న్యూస్ : <**

బుధవారం పాపన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ, సీఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శాసన సభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గం శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజలకు మరింత పారద ర్శకంగా, అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు క్యూఆర్ కోడ్ భద్రతతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని తెలిపారు. మెదక్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. లబ్ధిదారులకు కార్డులు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజలకు ప్రాథమిక సౌకర్యాల కోసం ఇబ్బందులు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచే స్తుందని తెలిపారు. కొత్త సాంకేతికతతో రూపొందించిన ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలులో స్మార్ట్ కార్డులు కీలకంగా మారనున్నాయని, రాష్ట్రంలో ప్రజాపాలన నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులు ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోందని, రైతులు పండించిన సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో విష్ణువర్ధన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు నీరుడి వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, నాయకులు మల్లప్ప, గోవింద్ నాయక్, నాని, భూమయ్య, సంతోష్ రెడ్డి, సతీష్, ఆయా గ్రామాల సర్పంచులు శ్రీధర్, వెంకయ్య, శ్రీనివాస్, సుశీల పాల్గొన్నారు.

# పోచమ్మ, దుర్గమ్మల విగ్రహాల ప్రతిష్టాపన.

- హనుమాన్ మందిరం ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ గౌడ్.

**సదాశివపేట. సెప్టెంబర్ 2. (సిరిన్యూస్)**



సదాశివపేటలోని హనుమాన్ నగర్ లోని ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గమ్మ దేవి పోచమ్మ దేవి లకు బోనాల ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. బోనాల కార్యక్రమంలో హనుమాన్ నగర్ కాలనీలోని హనుమాన్ మందిరం నుండి బోనాలు ప్రతి ఇంటి నుండి మహిళలు దుర్గాదేవి పోచమ్మ లకు బోనాలు సమర్పిం చుకొని వారి మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. ఈ బోనాల ఉత్సవాల్లో కాలనీ పెద్దలు యువకులు ఉత్సవాల్లో పాల్గొని పోతురాజుల తో విన్యాసాలు నిర్వహిం చుకుంటూ బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోమశేఖర్, కొత్త గొల్ల శేఖర్, ప్రవీణ్ కుమార్, రామచంద్రరావు, రమేష్ గౌడ్, ఎంకతల్ శ్రీకాంత్ గౌడ్, వీరేశం, శ్రీనివాస్ సూర్య ప్రకాష్ బి. శ్రీనివాస్, మధుకర్ రెడ్డి, శంకర్ గౌడ్, హనుమంత్ రెడ్డి, జై రాములు, రాంరెడ్డి, జైపాల్, సంగమేశ్వర్ రెడ్డి, అయ్యప్ప పంతులు, సంగమేశ్, శివకోటి తదితరులు భక్తజనం పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

- ఎస్సి, ఎస్టీ కేసుల రహిత జిల్లాగా తీర్చి దిద్దాలి*
- పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పకుండా నిర్వహించాలి*
- మానవీయ కోణంలో సేవలు అందించాలి*
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య*




**మెదక్ సెప్టెంబర్,02(సిరి న్యూస్)**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు కే.లక్ష్మి నారాయణ లుజిల్లా పర్యటనకు విచ్చేయగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డివి శ్రీనివాసరావు స్వాగతం పలికి.. పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న పథకాలు, సంక్షేమం, అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డు కలిగిఉన్న ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న పని వివరాలను అధికారుల ద్వారా సమీక్షించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఏవైనా అభివృద్ధికి సంబంధించి నిధులు పెండింగ్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదల అయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల అభ్యున్నతితో పాటు, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా మరింత కృషి చేయాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లోని పారిశుధ్య కార్మికులకు ఎస్ బీ ఐ బ్యాంక్ ఖాతాలు తీయించాలని, దీంతో కార్మికులకు భీమా సౌకర్యం ఉందని తెలిపారు.

**జిల్లా కలెక్టర్ కు అభినందన**

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సేవలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించారు. జిల్లా కలెక్టర్ అందరికీ ఒకే న్యాయం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలకు అందిస్తున్న ఉత్తమ సేవలను కొనియాడారు. ఎస్సీ, ఎస్టీలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. పోలీసులు, ఇతర శాఖల అధికారుల సేవలను అభినందించారు.

**కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు క్షేత్రస్థాయిలో అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పాఠశాల, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ, ప్రతి రోజూ కామన్ మెనూ అమలు చేస్తూ విద్యా బోధన సాగిస్తున్నా మన్నారు. అన్ని విద్యాలయాల్లో ప్రత్యేక అధికారులను నియమించి తనిఖీ చేయిస్తూ.. విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చూస్తున్నామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎప్పటిక ప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సహకారం, అంబేద్కర్ ఓవర్సీస్ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు తెలియజేశారు. కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. వివిధ దశల్లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం కలిగేలా చూస్తామని అన్నారు. కేసుల దర్యాప్తు పారదర్శకంగా చేపడతామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , డీఎఫ్ఓ జో జి,జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీఓలు రమాదేవి, బవయ్య , రామకృష్ణ లు, డీఎస్పీలు ప్రసన్నకుమార్ , నరేందర్ , వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు సింధు, విజయ లక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు,వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ హియరింగ్ ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్

**శివంపేట్ సెప్టెంబర్ 2 (సిరి న్యూస్ )**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్. హియరింగ్ (వ్యక్తిగత విచారణ ముమ్మరంగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.శివంపేట్ మండలం కొత్తపేట్ గ్రామంలో ఎస్ ఐ ఆర్ హియరింగ్ కేసులను నర్సాపూర్ ఆర్డిఓ రామకృష్ణ తాసిల్దార్ కమలాద్రి తో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివంపేట మండలం కొత్తపేట గ్రామమును సందర్శించి సర్ కు సంబంధించి ఓటరు జాబితాలో గుర్తించబడిన తప్పుల సవరణకు జారిచేసినటువంటి నోటిసుల విచారణ ప్రక్రియను మరియు బి ఎల్ ఓ అప్ నందు నమోదు చేసి ఏఈఆర్ఓ లాగిన్ కు పంపు విదానము మరియు ఏఈఆర్ఓ లాగిన్ నందు ధృవీకరణ ప్రక్రియను పరిశీలించడం జరిగిందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటు నమోదు ఉండాలని మరియు అనర్హత కలిగిన ఓటును తొలగించాలని, సర్ ప్రక్రియ ఖచ్చితత్వంతో జరగాలని సూచించారు. కోతపేట గ్రామానికి సంబంధించి 187 (ఏనామలీస్) పేరు మరియు వయసు పొరపాట్లు, 2002 సంవత్సరమునకు సంబంధించి ఓటరు/ వారి పూర్వికుల పేరుతో జతచేయలేకపోవడం వంటి మొత్తం 227 తప్పులను గుర్తించడం జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు 78 మంది వారికి సంబందించిన డాకుమెంట్లు సమర్పించగా ఆన్లైన్ నందు నమోదు చేయడం జరిగినదీ. అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ,సంబంధిత రెవెన్యూ సిబ్బంది బి ఎల్ ఓ తదితరులు పాల్గొన్నారు



# ఎస్ఐఆర్–2లో డబుల్ ఓట్లను సరిచేయాలి..

- తెల్లాపూర్ ఓట్లను అదే డివిజన్‌లో కలపాలి..
- అధికారులకు రాజేందర్ రెడ్డి వినతి

**రామచంద్రపురం(పటాన్‌చెరు), సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**



ఎస్ఐఆర్–2 ప్రక్రియపై బీజేపీ కిసాన్ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, పటాన్‌చెరు అసెంబ్లీ బీఎల్ఏ–1 మల్లెపల్లి రాజేందర్ రెడ్డి బుధవారం పటాన్‌చెరు అధికారులతో సమావేశమయ్యారు. ఈఆర్ఓ వెంకటేశ్వరరావు, ఎంఆర్ఓ హరిబాబుతో ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై చర్చించారు. పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి సరిచేయాలని రాజేందర్ రెడ్డి అధికారులను కోరారు. అలాగే తెల్లాపూర్ డివిజన్‌కు చెందిన కొన్ని ఓట్లు న్యూ మిగ్, విద్యుత్‌నగర్, భారతి నగర్ డివిజన్లలో ఉన్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తెల్లాపూర్‌కు చెందిన ఓటర్లు ఓటు వేసేందుకు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న న్యూ మిగ్ ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ ఓట్లను తెల్లాపూర్ డివిజన్‌లోనే చేర్చి, స్థానికంగా ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి డబుల్ ఓట్ల సమస్యను పరిష్కరించడంతో పాటు, తెల్లాపూర్ ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని రాజేందర్ రెడ్డి అధికారులను కోరారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు



- గోమారంలో రాజకీయ వర్గాల ఘర్షణలపై పోలీసుల కౌన్సిలింగ్*

**శివంపేట్ సెప్టెంబర్ 2 (సిరి న్యూస్ )**

గత కొద్ది రోజులుగా శివంపేట మండల పరిధిలోని గోమారం గ్రామంలో రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు,వర్గాల మధ్య తరచూ చోటుచేసుకుంటున్న ఘర్షణలు,వివాదాల నేపథ్యంలో గోమారం గ్రామపంచాయతీ వద్ద ఇరువర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలను పిలిపించి సమగ్ర కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై/సీఐ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమని, అయితే వాటిని వీధి పోరాటాలుగా మార్చి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పరస్పర దాడులు, దూషణలు, కక్షసాధింపు చర్యల వల్ల గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటమే కాకుండా సామాన్య ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు.

## పోలీసుల హెచ్చరికలు మరియు సూచనలు:

**బైండోవర్ కేసులు**

తరచూ ఘర్షణలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న ఇరువర్గాల వ్యక్తులపై తహసీల్దార్/ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చర్యలు చేపట్టడం జరుగుతుంది.

**కఠిన చట్టపరమైన చర్యలు**

ఇకపై ఎవరైనా వ్యక్తిగత లేదా రాజకీయ కారణాలతో గొడవలకు దిగినా, దాడులు చేసుకున్నా సంబంధిత వ్యక్తులపై నాన్–బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తాం.

**సోషల్ మీడియాపై నిఘా**

ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలలో ప్రత్యర్థి వర్గాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినా సైబర్ క్రైమ్ కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

**యువతకు విజ్ఞప్తి**

రాజకీయ నాయకుల ప్రలోభాలకు లోనై యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, పోలీస్ కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్‌పోర్టులు, ఇతర ఉన్నత అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి, శాంతియుత వాతావరణాన్ని కాపాడటానికి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్య తలెత్తితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా రానున్న వినాయక చవితి పండుగ నేపథ్యంలో పలు సూచనలు చేయడం జరిగింది ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్ మరి యు శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



- ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తూ ప్రజాపాలన
- గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్
- సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తోందని సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె సంగారెడ్డిలో ప్రత్యేకంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ప్రజా పాలన విజయవంతంగా కొనసాగుతోందని, మరో రెండేళ్లలో మ్యానిఫెస్టోలోని అన్ని హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు కోటేశ్వరులను చేయాలనే సంకల్పంతో ఆర్టీసి బస్సులకు వారిని యజమానులుగా మారుస్తున్నామని, పెట్రోల్ బంకుల నిర్వహణ, పావలా వడ్డీ రుణాలు అందిస్తున్నామని చెప్పారు. అలాగే, రైతన్నలకు ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేశామని, సన్న బియ్యం పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వని దుస్థితి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కోటికి పైగా రేషన్ కార్డులు మంజూరు చేసి పేదలకు ఆహార భద్రత కల్పించామని నిర్మలా జగ్గారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆర్. కిరణ్ గౌడ్, సీనియర్ నాయకుడు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ పోరుబాట



- భారతి నగర్ ఎల్ఐజీ కాలనీలో 'బాకీ కార్డుల' పంపిణీ

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన 'కాంగ్రెస్ పార్టీ 420 మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం భారతి నగర్ డివిజన్ ఎల్ఐజీ కాలనీలో 'బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు, వాటి కింద లబ్ధిదారులకు అందాల్సిన బకాయిల వివరాలను ప్రజలకు వివరించారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెన్షన్, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ కింద తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వరి పంటకు బోనస్, రైతు కూలీలకు ఆర్థిక సహాయం, విద్యా భరోసా కార్డు, ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం తదితర హామీలను గుర్తుచేశారు.

**బకాయిలను వెంటనే విడుదల చేయాలి**

వెయ్యి రోజులు–33 నెలల పాలనలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సింధు ఆదర్శ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి



**మండల రెవెన్యూ అధికారి విజయలక్ష్మి**

**వెల్దుర్తి,సెప్టెంబర్ 02, (సిరి న్యూస్ ) :**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని, మండలంలో పారదర్శకమైన, తప్పులులేని ఓటర్ల జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసిల్దార్ విజయలక్ష్మి కోరారు. బుధవారం వెల్దుర్తి మండలం శేరిల్ల, చెర్లపల్లి ఆరెగూడెం, ఎలకపల్లి, గ్రామాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సార్)పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. కొత్తగా పేరు నమోదుకు ఫారం-6, మార్పులు-చేర్పులు లేదా అభ్యంతరాలకు ఫారం-8తో పాటు డిక్లరేషన్ ఫారమ్‌లను పూర్తి చేసి ఆయా పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్, జిపిఓ లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులు, అంగన్వాడీ టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు చేపట్టే ధర్నాకు అనుమతి ఇవ్వండి



- **జిన్నారం సీఐ రమణారెడ్డికి బీఆర్ఎస్ నాయకుల వినతి**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

రైతులకు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపిస్తూ, రైతుల సమస్యలపై ప్రభుత్వానికి నిరసన తెలియజేసేందుకు ఈ నెల 5వ తేదీన రైతు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని కానుకుంట చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు ధర్నా నిర్వహణకు పోలీసుల అనుమతి మంజూరు చేయాలని కోరుతూ జిన్నారం సీఐ రమణారెడ్డి, గుమ్మడిదల ఎస్ఐ అరుణ్ కుమార్‌లకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. రైతు సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రైతుల గొంతుకగా నిలిచేందుకు శాంతియుతంగా ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వానికి తెలియజేయడం ప్రతి ఒక్కరి హక్కు అని, ఈ నేపథ్యంలో రైతులతో కలిసి నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి పోలీసు శాఖ అనుమతి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పార్టీ నాయకులు, రైతులు పూర్తి సహకారం అందిస్తారని పోలీసు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, చక్రపాణి, మురళి, కిషన్, నాయకులు రాజు, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'గేట్'తో అవకాశాలను అందిపుచ్చుకోండి

- **గీతం విద్యార్థులకు గేట్ ఏరోస్పేస్ అకాడమీ అశోక్ నాయుడు సూచన**

**రామచంద్రపురం(పటాన్‌చెరు), సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (గేట్) ఉన్నత అవకాశాలకు ముఖద్వారం వంటిదని, ఇందులో ఉత్తీర్ణత సాధించడం ద్వారా విద్యార్థులు మంచి కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చని గేట్ ఏరోస్పేస్ అకాడమీకి చెందిన అశోక్ నాయుడు అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు. గేట్ ద్వారా ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రభుత్వ రంగ సంస్థలు, రక్షణ సంస్థలు, పరిశోధనా సంస్థలు, ప్రైవేటు రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని అశోక్ నాయుడు వివరించారు. రక్షణ రంగంలో ఏఎఫ్‌క్యాట్, సీడీఎస్, ఎస్ఎస్‌సీ టెక్నికల్, యూఈఎస్, టీజీసీ, ఎన్‌సీసీ వంటి ప్రవేశ మార్గాలతో పాటు హెచ్ఏఎల్, డీజీసీఏలోనూ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పరిశోధన, ఉన్నత విద్యలోనూ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. డీఆర్‌డీఓ, డీఆర్‌డీఎల్‌లో శాస్త్రవేత్తలుగా, భారత వైమానిక దళంలో టెక్నికల్ అధికారులుగా, సీఎస్ఐఆర్-జేఆర్ఎఫ్‌లుగా పనిచేసే అవకాశాలతో పాటు ఐఐటీలు, ఐఐఎస్సీలో పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఏకాగ్రతతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అశోక్ నాయుడు సూచించారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ నాతి వేణుకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు





- **డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడి మోసాలపై అవగాహన తప్పనిసరి.**
- **సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండండి.**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.**

**సదాశివపేట. సెప్టెంబర్ 2. (సిరిన్యూస్)**

సెప్టెంబర్ నెల మొదటి మొదటి బుధవారం సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, సదాశివపేట పట్టణంలోని ఓ బ్యాంకెట్ హాల్ నందు సైబర్ నేరాల నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృకత దివాస్ పేరుతో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది అన్నారు.

**డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త.**

తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపి, పిన్, సివివి పాస్‌వర్డ్‌లు వంటి రహస్య సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని అన్నారు. బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు ఇవ్వవద్దని, డిజిటల్ చెల్లింపులు చేసే సమయంలో సరైన వ్యక్తి ఖాతాకే నగదు వెళ్తుందో నిర్ధారించుకోవలని సూచించారు.

**ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత.**

ఆన్‌లైన్‌లో భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్లు చూపిస్తూ నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని వెబ్‌సైట్లు, వ్యక్తులకు ముందస్తుగా నగదు చెల్లించకుండా, విశ్వసనీయమైన ప్లాట్‌ఫారమ్‌లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు.

**పెట్టుబడి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.**

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్, క్రిప్టో, షేర్ మార్కెట్ పేరుతో వచ్చే అనుమానాస్పద ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. తొందరపెట్టి డబ్బులు పెట్టుబడి పెట్టించే వ్యక్తులు లేదా సంస్థల వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా www.cyber-crime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. తద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

**గణేష్ మండపాల వద్ద కూడా సైబర్ అవగాహన.**

గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాలు జరుగునున్న నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేసి భక్తులు, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ, సమన్వయ సమావేశాలను కూడా సైబర్ అవగాహన కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తత కూడా ఎంతో కీలకం. చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారి తీయవచ్చు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటించి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలి అని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డి4సి డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, సైబర్ సెల్ సిబ్బంది, సదాశివపేట పట్టణానికి చెందిన సుమారు 350 మంది వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ ఆలయ కమిటీకి తొలిరోజే

# రాజకీయ సెగ

- **ప్రమాణ స్వీకారంలో ప్రోటోకాల్ వివాదం..**
- **సర్పంచ్ కు సమాచారం ఇవ్వలేదంటూ ఆరోపణలు**
- **హడావుడిగా కార్యక్రమం.. అర్ధాంతరంగా కమిటీ ఎన్నిక**
- **ఆలయ బోర్డు ఏర్పాటుపైనే రాజకీయ చర్చలు**

**గజ్వేల్ సెప్టెంబర్ 02 (సిరి న్యూస్ )**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుతో ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని ఆశించిన వేళ.. బోర్డు తొలి కార్యక్రమమే వివాదానికి దారితీసినట్లు తెలుస్తోంది. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామంలోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా ప్రోటోకాల్, సమన్వయంపై పలు ప్రశ్నలు తలెత్తాయి.

**సర్పంచ్ కు సమాచారం ఇవ్వలేదా?**

ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధిత గ్రామ సర్పంచ్‌కు ముందస్తుగా సమాచారం ఇవ్వలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన సమాచారం, ప్రాధాన్యం కల్పించకుండా కార్యక్రమాన్ని నిర్వహించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రామస్థాయిలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

**జీఓతో బోర్డు ఏర్పాటు.. వెంటనే ప్రమాణ స్వీకారం**

తెలంగాణ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. హనుమంతరావు సెప్టెంబర్ 1న జారీ చేసిన జీఓ ఆర్‌టీ నంబర్ 546 ప్రకారం కొండపోచమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకం జరిగినట్లు సమాచారం. నియమితులైన డైరెక్టర్లతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అయితే ఇంత కీలకమైన కార్యక్రమానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లు, సభ్యుల మధ్య సమన్వయం వంటి అంశాలపై పూర్తిస్థాయి కసరత్తు జరగలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



**కమిటీ ఎన్నికలోనూ గందరగోళమా?**

ప్రమాణ స్వీకారం అనంతరం ట్రస్ట్ బోర్డు కమిటీ ఎన్నిక ప్రక్రియను చేపట్టినప్పటికీ.. అది పూర్తికాకుండానే అర్ధాంతరంగా ముగిసినట్లు తెలుస్తోంది. దీంతో బోర్డు కమిటీ ఎన్నిక ఎప్పుడు, ఏ విధంగా పూర్తవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బోర్డు ఏర్పాటైన తొలి రోజే ఎన్నిక ప్రక్రియపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీసింది.

**రాజకీయ సమీకరణాల ప్రభావమా?**

కొండపోచమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వెనుక రాజకీయ సమీకరణాలు, స్థానికంగా ఉన్న పార్టీ విభేదాలు ప్రభావం చూపాయా అనే చర్చ కూడా సాగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారికంగా ఎలాంటి స్పష్టత వెలువడలేదు. రాజకీయాలకు అతీతంగా ఆలయ నిర్వహణ సాగాల్సిన నేపథ్యంలో బోర్డు ఏర్పాటు తొలిరోజే వివాదాస్పదంగా మారడం భక్తుల్లో ఆసక్తిని కలిగిస్తోంది.

**ఆలయ ప్రతిష్ఠే ముఖ్యం**

కొండపోచమ్మ ఆలయం ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే ప్రముఖ పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందింది. ఆలయ అభివృద్ధి, భక్తులకు మౌలిక సౌకర్యాలు, పారిశుద్ధ్యం, వసతులు, ఆలయ నిర్వహణ వంటి అంశాల్లో ట్రస్ట్ బోర్డు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఇలాంటి నేపథ్యంలో బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, కమిటీ ఎన్నిక వంటి కార్యక్రమాలను నిబంధనలు, ప్రోటోకాల్‌కు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, బోర్డు సభ్యుల మధ్య సమన్వయం ఉంటేనే ఆలయ అభివృద్ధి లక్ష్యాలు నెరవేరుతాయని భక్తులు పేర్కొంటున్నారు.

**ముందున్నది అసలు పరీక్షే!**

ట్రస్ట్ బోర్డు ఏర్పాటుతో ఆలయ అభివృద్ధిపై భక్తుల్లో ఆశలు పెరిగాయి. అయితే తొలి కార్యక్రమంలోనే ప్రోటోకాల్, సమన్వయం, కమిటీ ఎన్నిక వంటి అంశాలు చర్చకు రావడం బోర్డు పనితీరుపై ఆసక్తిని పెంచింది. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులు సమన్వయంతో వ్యవహరించి ఆలయ ప్రతిష్ఠకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

**బోర్డు పూర్తి స్థాయి కమిటీ ఎప్పుడు కొలువుదీరుతుంది?**
**ప్రోటోకాల్ వివాదంపై అధికారులు స్పందిస్తారా?**
**తొలి రోజే తలెత్తిన విభేదాలకు ముగింపు పలికేదెప్పుడు?**
**అనే ప్రశ్నలు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.**

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి**

**నారాయణపేట, సెప్టెంబర్,02**

నారాయణపేట రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు జాజాపూర్ గ్రామంలో రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లు, ఈ-మెయిల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు, OTP, PIN, CVV, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలియజేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు, బహుమతులు, రుణాలు, పెట్టుబడులు, కస్టమర్ కేర్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అలాగే సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకుని, టూ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని సూచించారు.

# మౌలిక వసతుల కల్పనే మా అభివృద్ధి లక్ష్యం

- 15వ వార్డులో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన
- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే మున్సిపల్ పాలకవర్గ ప్రధాన లక్ష్యమని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చోట మౌలిక వసతుల పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో నగర అభివృద్ధి నిధుల నుంచి సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపే దిశగా మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించేందుకు అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 15వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పూర్తయితే స్థానిక ప్రజలకు



రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణంలో ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ గుమ్మడిదలను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సికెజీ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**మునిపల్లి, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో విద్యుత్ సమస్యలు, రేషన్ కార్డులు, ఎస్ఐఆర్‌పై ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఫోన్ చేసిన వెంటనే స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి రామాచారి సూచించారు. గార్లపల్లి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని సర్పంచ్ ఈశ్వరప్ప సభ



దృష్టికి తీసుకురాగా, మండలంలోని శిథిల పాఠశాలల వివరాలను సిద్ధం చేయాలని ఎంఈఓ భీంసింగ్‌ను రామాచారి ఆదేశించారు. గురుకుల, ఎస్సీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని వార్డెన్లు, ప్రిన్సిపాళ్లను హెచ్చరించారు. పెద్దగోపులారం శివారులోని లక్ష్మీనారాయణ చెరువు కబ్జా అంశంపై సర్పంచ్ బుడ్డ మల్లేశం ప్రశ్నించగా, సంబంధిత ఏఈ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో రామాచారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి 45 రోజులకు ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు గొల్ల అంజయ్య, సుధాకర్‌రెడ్డి తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, మంజూరైన ఇళ్లను ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో పాటు మంత్రి దామోదర రాజనర్సింహ అదనంగా రూ.2 లక్షల సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, ఏవో అనితారెడ్డి, ఏపీఓ యాదగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, డాక్టర్ సంధ్యారాణి, ఎక్సైజ్ ఎస్ఐ సతీష్, ఎంఈఓ భీంసింగ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఎస్ఓ కవితారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# 420' హామీలపై బీఆర్ఎస్ భగ్గు!..

- 420 అడుగుల ఫ్లెక్సీతో నిరసన..
- దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో ఆందోళన..
- హామీల అమలుకు గడువు డిమాండ్..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (సిరి న్యూస్)**





ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బెల్లంపల్లిలో బుధవారం భారీ నిరసన చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఆందోళనకు సుమారు వెయ్యి మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా 420 అడుగుల పొడవైన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అమలు చేసినవి.. పెండింగ్‌లో ఉన్న హామీల వివరాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి హామీp అమలుకు ప్రభుత్వం నిర్దిష్ట గడువును ప్రకటించాలని కోరారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. కేవలం హామీలు ప్రకటించడమే కాకుండా వాటి అమలుకు కార్యాచరణ ప్రణాళిక, గడువులను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం కల్పించారని, వాటి అమలుపై ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. ప్రతి హామీపై స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు అమలు చేయని హామీలకు గడువులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళిత హక్కుల కోసం కొత్త కమిటీ..

- నస్పూర్‌లో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా బచ్చల రమేష్..
- అధికార ప్రతినిధిగా గుంపుల స్వామి..
- ప్రధాన కార్యదర్శులుగా శేఖర్, విజయ్..
- దళిత హక్కుల కోసం ఐక్య పోరాటం..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (సిరి న్యూస్)**

దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) నస్పూర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నస్పూర్ మండల కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నూతన మండల అధ్యక్షుడిగా బచ్చల రమేష్, అధికార ప్రతినిధిగా గుంపుల స్వామి, ప్రధాన కార్యదర్శులుగా కొయ్యల శేఖర్, కంపెల్లి విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. దళితుల



సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని సమావేశంలో నిర్ణయించారు..

**హక్కుల సాధనకు ఐక్య పోరాటం..**

నస్పూర్ మండలంలో ఎంఆర్‌పీఎస్‌ను మరింత బలోపేతం చేసి, గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని విస్తరించేందుకు నూతన కమిటీ కృషి చేయాలని నాయకులు సూచించారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని నూతన కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. దళితుల సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి చిప్పకుర్తి మల్లేష్, నస్పూర్ మండల ఇన్‌చార్జి గద్దల భాన్నయ్య, మాజీ మంచిర్యాల ప్రధాన కార్యదర్శి సుందిల్ల మల్లేష్, దళిత అవార్డు గ్రహీత ఇరికిల్ల పురుషోత్తం, సీనియర్ నాయకులు నక్క అంజన్న, మంథని మల్లేష్, చుంచు శంకర్ వర్మ, జూపెల్లి సాయిలు పాల్గొన్నారు. నూతన కమిటీ ఎన్నికతో నస్పూర్ మండలంలో ఎంఆర్‌పీఎస్ కార్యకలాపాలకు మరింత ఊపు రానుందని నాయకులు పేర్కొన్నారు. దళితుల హక్కుల పరిరక్షణే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతామని నూతన కమిటీ ప్రకటించింది.

# మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు



## వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్):**

మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా తెల్లాపూర్ డివిజన్ 263లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుపేద కుటుంబాల సంక్షేమానికి వైఎస్సార్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్వ శ్యామ్‌రావు, మాజీ కౌన్సిలర్ భరత్, డీసీసీ జనరల్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు అరుణ్‌గౌడ్, రవి, యాదగల్, కాంగ్రెస్ నాయకులు రాజు, మంగలి మహేష్, ప్రశాంత్, బలరాం, కొల్లూర్ శ్రీను, హరీష్‌గౌడ్, విక్రమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శిరీష హత్య.. భగ్గుమన్న విద్యార్థులు..



- నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి..
- కఠిన శిక్షలు అమలు చేయాలి..
- వేగంగా నిష్పక్షపాత దర్యాప్తు చేయాలి..
- బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలి..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (సిరి న్యూస్)**

ఆదివాసీ యువతి ఊక శిరీషపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై నస్పూర్ మండల కేంద్రంలో ఐక్య విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకుడు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, శిరీషను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తే కఠిన శిక్షలు తప్పవనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా నిందితులను గుర్తించకపోవడం ఆదివాసీ, దళిత, బహుజన వర్గాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కుటుంబానికి అండగా ఉన్న శిరీష హత్యకు గురికావడం అత్యంత విషాదకరమని, కేసును నిష్పక్షపాతంగా, వేగంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం, భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జుమ్మిడి గోపాల్, పూరెళ్ల నితీష్, వంశీ, పవన్, ప్రశాంత్, అలేఖ్య, హరిణి, శివాని తదితరులు పాల్గొన్నారు.

# చేపల వలలో చిక్కుకుని యువకుడు మృతి



## చిన్న ఘనపూర్ మంజీరా నదిలో విషాద ఘటన..

**కొల్చారం, సెప్టెంబర్ 02 (సిరి న్యూస్)**

కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన బోలా సాయికిరణ్ (24) మంజీరా నదిలో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో చేపలు పట్టేందుకు చిన్న ఘనపూర్ శివారులోని మంజీరా నదికి వెళ్లిన సాయికిరణ్ చేపలు పడుతుండగా మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుంది. చేపలు పట్టే వల రెండు కాళ్లకు చుట్టుకోవడంతో దానిని విడిపించుకోలేక నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడి తండ్రి బోలా కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్ తెలిపారు.



# నేపాల్‌లో మళ్లీ వర్షాలు

- ఉప్పొంగుతున్న మూడు ప్రధాన నదులు

**ఖాట్మాండ్, సెప్టెంబర్ 2 , సిరి న్యూస్:**

నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్‌జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది. ఇప్పటివరకు 1,113 మృతదేహాలకు పోస్టుమార్టం, చట్టపరమైన గుర్తింపు ప్రక్రియలు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. 95 మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. గుర్తింపు లేని 911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇప్పటివరకు 6,541 మందిని రక్షించగా 4,858 మంది గల్లంతయ్యారు. 7,912 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు.



## భారత్-అమెరికా వాణిజ్య
# చర్చల్లో పురోగతి

- ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు పీయూష్ గోయల్
- పరస్పర ప్రయోజనకర వాణిజ్య సంబంధంపై దృష్టి
- వాణిజ్యానికి మించి సాంకేతికత, పెట్టుబడులపై సహకారం
- 'ప్యాక్ట్ సిలికా'తో పెట్టుబడులకు ఊతం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, సిరి న్యూస్:**

భారత్‌అమెరికా దేశాలు న్యాయమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య సంబంధాన్ని నిర్మించేందుకు సన్నిహితంగా పనిచేస్తున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య అవగాహనపై ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించామని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు చెప్పారు.

**వాణిజ్య చర్చలు కొనసాగింపు**

ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 66వ వార్షిక సమావేశంలో మాట్లాడిన సెర్గియో గోర్.. భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య అవగాహనతో పాటు పలు అంశాల్లో వాస్తవమైన పురోగతి సాధించామని తెలిపారు. జీ20 చర్చల నేపథ్యంలో పీయూష్ గోయల్ అమెరికాతో చర్చలను కొనసాగిస్తారని చెప్పారు.

**అన్ని రంగాల్లో సహకారం**

ఇరు దేశాల మధ్య పురోగతి వస్తువుల వాణిజ్యానికే పరిమితం కాలేదని గోర్ అన్నారు. సాంకేతికత, పెట్టుబడులు, ఆవిష్కరణలు సహా దాదాపు అన్ని రంగాల్లో భారత్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

**'ప్యాక్ట్ సిలికా'తో పెట్టుబడులకు ఊతం**

ఈ ఏడాది భారత్, అమెరికా 'ప్యాక్ట్ సిలికా' డిక్లరేషన్‌పై సంతకం చేశాయని గోర్ తెలిపారు. ఆవిష్కరణలకు అనుకూలమైన నియంత్రణ వ్యవస్థ ఏర్పాటుకు ఇది కీలక ముందడుగని అన్నారు. ఇరు దేశాల కంపెనీలు పరస్పరం సరిహద్దులు దాటి పెట్టుబడులు పెట్టుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కొత్త తరం పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు కూడా మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# ఘనంగా 'జాతీయ సైబర్ జాగరూకతా దివస్'

- 438 అవగాహనా కార్యక్రమాలు
- టీజీసీఎస్‌బీ హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, సిరి న్యూస్:**

పౌరుల్లో సైబర్ అవగాహనను పెంచడం, సురక్షితమైన డిజిటల్ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'జాతీయ సైబర్ జాగరూకతా దివస్' ఘనంగా నిర్వహించారు.. ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా డిజిటల్ పేమెంట్స్, ఆన్లైన్ షాపింగ్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ వంటి అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా TGCSB తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రత్యేక ప్రచార సామగ్రిని అన్ని పోలీసు స్టేషన్లకు అందించింది.

**బాధితులు వెంటనే స్పందించాలి**

ఆన్‌లైన్ షాపింగ్ చేసే సమయంలో విక్రేతలను, వెబ్‌సైట్లను సరిచూసుకోవాలని, అపరిచిత లింక్‌లను క్లిక్ చేయవద్దని పోలీసులు సూచించారు. గోల్డెన్ అవర్ (కీలక సమయం)లో వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా www.cybercrime.gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని టీజీసీఎస్‌బీ పేర్కొంది.

# అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండా ఎల్లం

**రామాయంపేట, సెప్టెంబర్ 2 (సిరి న్యూస్)**



రామాయంపేట పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చేపడుతున్న పనులు హర్షణీయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మెదక్ జిల్లా అధ్యక్షుడు గుండా ఎల్లం అన్నారు. బుధవారం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను గుండా ఎల్లం తదితరులు పరిశీలించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా గుండా ఎల్లం మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు ద్వారా ఆయన ఆశయాలను ప్రజల్లో మరింతగా చాటిచెప్పే అవకాశం ఏర్పడుతుందన్నారు. రామాయంపేట పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, మున్సిపల్ పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో తెలంగాణ యుద్ధనౌక గద్దర్, వెంకటస్వామి తదితర మహనీయుల విగ్రహాలను కూడా రామాయంపేట పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరారు. మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం, కాంగ్రెస్ నాయకులు బైరం శంకర్, బైరం శీను, గంగారం, భూమకిషన్, కొక్కు బాబు, సత్యం, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

# పంట కుంటలపై అదనపు కలెక్టర్ ఫోకస్..

- చిత్తాపూర్‌లో పంట కుంటల పనుల పరిశీలన..
- పనుల తీరుపై చంద్రయ్య సంతృప్తి..
- ఎక్కువ మంది రైతులకు కుంటలు ఏర్పాటు చేయాలని ఆదేశం..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (సిరి న్యూస్)**




వర్షపు నీటిని నిల్వ చేసుకుని పంటలకు అవసరమైన సమయంలో వినియోగించడంతో పాటు భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న పంట కుంటల నిర్మాణ పనులు గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. నెన్నెల మండలంలో వీబీజీ పథకం జలసిరి కింద చేపడుతున్న పంట కుంటల పనులను అదనపు కలెక్టర్ చంద్రయ్య పరిశీలించారు. చిత్తాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళలు చేపట్టిన పంట కుంటల పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పంట కుంటల నిర్మాణంలో పనుల నాణ్యత, నిర్వహణ తీరును పరిశీలించిన చంద్రయ్య సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేలా పంట కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు. మండలంలోని ఎక్కువ మంది రైతులకు పంట కుంటలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన రైతులను గుర్తించి పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. పంట కుంటల ద్వారా రైతులకు సాగునీటి భరోసా కల్పించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీడీవో పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం అడ్డుకున్న సర్పంచ్‌పై బీఎస్పీ సమరభేరి

## బేషరతు క్షమాపణ చెప్పాలని హెచ్చరిక

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (సిరి న్యూస్)**



అంబేద్కర్ పేరు చెప్పుకొని రాజకీయాలు చేసే నేతలు... ఆయన విగ్రహాన్నే అడ్డుకుంటారా అంటూ బీఎస్పి జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. దళిత మంత్రి నియోజకవర్గంలోనే అంబేద్కర్ విగ్రహాన్ని అడ్డుకోవడం ఏంటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సిర్స గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సర్పంచ్ గుడిసెల పోసక్క అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇది వ్యక్తిగత విషయం కాదు... రాజ్యాంగంపై దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులతోనే సర్పంచ్‌గా గెలిచి, అదే వ్యక్తి విగ్రహాన్ని అడ్డుకోవడం హేయమైన చర్యగా చెప్పారు. భూమిపూజ జరిగిన చోటే విగ్రహం నిర్మించాల్సిందేనని, పోసక్క తన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాల్సిందేనని అల్టిమేటం జారీ చేశారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద తక్షణమే కేసు నమోదు చేయాలని..సర్పంచ్ పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నూరి రాజు, జిల్లా అధ్యక్షుడు గాజుల శంకర్, ఉపాధ్యక్షుడు ఎండీ మతిన్ ఖాన్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గోమాస బ్రహ్మానందం, మందమర్రి మండల అధ్యక్షుడు ఎండీ రహీం బాబా తదితరులు పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు.

# చీదెళ్ల గ్రామ నివాసి వెన్న గోపిరెడ్డి

## రెడ్డి జాగృతి సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా నియామకం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02 సిరి న్యూస్:**

పెన్ పహాడ్ మండల చీదెళ్ల గ్రామ నివాసి వెన్న గోపిరెడ్డి కి రెడ్డి జాగృతి సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా చీదెళ్ల గ్రామంలో ఆయనను గ్రామ సర్పంచి, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

**నియామకం వివరాలు:**

రెడ్డి జాగృతి జాతీయ అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురుకంటి నర్సిరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మద్ది సుధాకర్ రెడ్డిల సహకారంతో వెన్న గోపిరెడ్డి ఈ బాధ్యతల్లోకి ఎంపికయ్యారు.

**అభినందించిన ముఖ్యులు:**

వరికళ్ళు పద్మ శ్రీనివాస్ (చీదెళ్ల గ్రామ సర్పంచి), విలాసకవి వెంకటరాజు , పరెడ్డి లింగారెడ్డి, వెన్న సైదిరెడ్డి, కంచర్ల లక్ష్మారెడ్డి, పరెడ్డి సుధీర్ రెడ్డి నాగిరెడ్డి రవీందర్ రెడ్డి, గొబ్బి యేసు తదితరులు.. <సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా నియమితులైన వెన్న గోపిరెడ్డి, రెడ్డి సామాజిక వర్గం, సమాజ శ్రేయస్సు కోసమే కాకుండా సామాజిక ఆర్థిక అసమానతల పైన మరియు రాజకీయ, సామాజిక అంశాల గురించి నిరంతరం కృషి చేస్తారని, అదేవిధంగా బడుగు బలహీనవర్గాల ప్రజలకు పేద విద్యార్థిని విద్యార్థులకు తనవంతు సహాయం సహకారాలు అందిస్తారని జిల్లా కార్యదర్శిగా నియమితులైన వారని వారియొక్క సేవలను మరింత విస్తరించాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.



# సోషల్ మీడియాలో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలి పై అనుచిత వ్యాఖ్యలు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02 సిరి న్యూస్:**

సోషల్ మీడియాలో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్ కె .అనిల్ ను తక్షణమే విధుల నుంచి తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా నాయకత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కుందూరు దేవేందర్ రెడ్డి, సూరారపు కృష్ణవేణి ఆదేశాల మేరకు సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు.

**ప్రధాన డిమాండ్లు & విజ్ఞప్తులు,తక్షణ విచారణ:**

సోషల్ మీడియాలో పోలీస్ శాఖకు చెందిన వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని కోరారు.

**కఠిన చర్యలు:** నిబంధనల ప్రకారం బాధ్యుడైన కానిస్టేబుల్ కె. అనిల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే మహిళలపై సోషల్ మీడియా వేదికగా వేధింపులకు పాల్పడేవారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హాజరైన నాయకులు జిల్లా సీనియర్ నాయకులు నకిరేకంటి సతీష్ , కోదాడ నియోజకవర్గ ఇంచార్జి సంజీవ్ రావు నాయక్, సూర్యాపేట నియోజకవర్గ నాయకులు నల్లబోలు సైదిరెడ్డి, నాగమణి, ఉప్పల చారి తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.